క్లుప్తంగా

జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి – అమలపాడు మధ్య చేపడుతున్న జంగిల్ క్లియరెన్స్‌తో ప్రమాదాలు నివారించవచ్చునని అమలపాడు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు దున్న రత్నంబాలరాజు అన్నారు. మంగళవారం పూండి నుంచి అమలపాడు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా దట్టంగా అల్లుకున్న పొదలు, చెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ రహదారిలో ఎక్కువగా మలుపులు ఉన్నందున ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించడం జరుగుతోందని తెలిపారు. వాహన చోదకులు మలుపులు వద్ద జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వజ్రపుకొత్తూరు: ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని శంకర్ ఫౌండేషన్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కూన అరుణ, కరుణాకరణ్ సూచించారు. మండలంలోని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మాజీ సర్పంచ్ మరడ భాస్కరరావు ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సంబంధిత సమస్యలు ఉన్న 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు, దృష్టి లోపం ఉన్న 40 మందిని శస్త్ర చికిత్సల కోసం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి బస్సులో పంపించారు. కార్యక్రమంలో వెంకటాపురం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యుడు త్రిపాఠి, ఏరియా కో–ఆర్డినేటర్ టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా నేడు

పలాస: గ్రామీణ తపాలా ఉద్యోగుల జాతీయ నాయకుడు మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మహాధర్నా చేయనున్నట్లు ఏఐజీడీఎస్‌యూ సహాయ కార్యదర్శి ఎస్.నందికేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి సిబ్బంది తరలి రావాలని కోరారు.

విద్యార్థుల అవస్థలు



వసతి గృహం వద్ద నిల్వ ఉన్న నీరు

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు నిత్యం సమస్యలతో సతమతం అవుతున్నారు. వసతి గృహం వెలుపల మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో కళాశాలకు వెళ్లి, వచ్చే సమయాల్లో అవస్థలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న ఈ వసతి గృహం వద్దకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నీరుచేరి నిల్వ ఉండిపోయి చెరువులా తయారైంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలకు ఆవాసంగా మారిపోయింది. అందువలన ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: పౌష్టికాహారంతోనే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాలు–2025 కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో బి.రాజేశ్వరి, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు పిట్ట హేమలత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మంగళవారం పరామర్శించారు. హేమలత మామయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త పిట్ట హరిశ్చంద్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మందుబాబుల హల్‌చల్

- మద్యం మత్తులో శివారు ప్రాంతాల్లో వీరంగం
- భయపడుతున్న సామాన్యులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

టెక్కలి రూరల్: టెక్కలి శివారు ప్రాంతాల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం అతిగా సేవించి రోడ్డు పక్కగా ఆగి ఉన్న వాహనాల అద్దాలు ధ్వంసం చేయడం.. కనిపించిన వారితో గొడవలకు దిగడం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా జగతిమెట్ట సమీపంలోని అప్రోచ్ రోడ్డులో మందుబాబులు మందుతో పాటు గంజాయి వంటివి సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా వలేసాగరం సమీపంలో బెల్ట్‌షాపులు అధికంగా పెరిగిపోవడంతో అక్కడ మందుబాబులు రాత్రి సమయాల్లో దాడులకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం ఒక ట్యాక్సీ డ్రైవర్ తన కారును బ్రాహ్మణవీధి శివారు హైవేకి ఆనుకుని ఉన్న తన ఇంటి వద్ద పార్క్‌చేసి ఉంచారు. అయితే కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మద్యం మత్తులో రాళ్లతో ఆ కారు అద్దాలను ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా యర్రన్నాయుడు పార్క్ సమీపంలో, రావివలస జంక్షన్, టెక్కలి డిగ్రీ కళాశాల మైదానం, జూనియర్ కళాశాల మైదానం వంటి ప్రదేశాల్లో సైతం మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల మందుబాబులు అద్దాలు పగలుగొట్టిన కారు ఇదే...

విచ్చలవిడిగా అమ్మకాలు



గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. మద్యం షాపులు నిర్వహించే వారి కనుసన్నల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనునిత్యం మద్యం అందుబాటులో ఉంటోంది. టెక్కలి మండలం పరిధిలోని చాలా గ్రామాల్లో బెల్ట్‌షాపులు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిని అరికట్టే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– హనుమంతు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, టెక్కలి

ప్రత్యేక నిఘా పెట్టాం



బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మద్యం అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అలాగే ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. మందుబాబులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.రాము, ఎస్ఐ, టెక్కలి

భయమేస్తోంది

నేను ఒక హోటల్‌లో పనిచేస్తుంటాను. పని పూర్తయ్యాక రాత్రి ఇంటికి నడిచి వెళ్లాలంటే భయం వేస్తోంది. రహదారి పక్కగా కొంతమంది మద్యం సేవించి ఉంటున్నారు. అందుకనే ఎవరినైనా తోడు పెట్టుకుని ఇంటికి వెళ్తున్నాను.

– రాజులమ్మ, టెక్కలి

ప్రైవేటీకరణపై పోరు



సోంపేట: ఇసకలపాలేం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రైవేటీకరణతో పేద బిడ్డలకు వైద్య విద్యను దూరం చేయాలని కూటమి కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణను వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



సోంపేట: గొల్లగండిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం గ్రామంలో...



కవిటి: బొరివంకలో కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు




టెక్కలి: చిన్నసాన గ్రామంలో కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్ తదితరులు



నందిగాం: కోటి సంతకాల సేకరణలో భాగంగా కవిటి అగ్రహారంలో సంతకాలు చేయిస్తున్న తిలక్

బీల ఉద్యమ నాయకుడు మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పర్యావరణ పరిరక్షణ, మత్స్యకార సంఘ నాయకులు

సోంపేట: బీల ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో పాటు గత 15 ఏళ్లుగా ఉద్యమానికి విశేష సేవలందించిన సోంపేట పట్టణానికి చెందిన సదాశివుని గంగాధర్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. దీంతో బీల ప్రాంత గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. గంగాధర్ థర్మల్ ఉద్యమం ప్రారంభం నుంచి తనవంతు పాత్రను పోషించాడు. ఈ ప్రాంతంలో చేపట్టిన ప్రతీ సభను విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించాడు. అప్పట్లో థర్మల్ విద్యుత్ కర్మాగారం నిర్మాణం చేపట్టవద్దని సోంపేటలో 2,166 రోజులు నిరాటంకంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీంతో ప్రతిరోజూ ఉదయం దీక్ష స్థలానికి గంగాధర్ చేరుకొని స్థలం శుభ్రం చేయడంతో పాటు, దీక్ష విరమించే వారికి నిమ్మరసం ఇచ్చేవరకు తనవంతు పాత్ర పోషించేవారు. ఆయన మృతదేహానికి పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, పర్యావరణ పరిరక్షణ, మత్స్యకార సంఘ నాయకులు బీన డిల్లీరావు, సూరాడ చంద్రమోహన్, బార్ల సుందరరావు, నాగు, వెంకన్న, తిరుపతి, కోదండ తదితరులు సంతాపం తెలియజేశారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు వై.రమేష్, అశోక్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి సంతోష్‌కుమార్ తదితరులు వారిని అభినందించారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

టెక్కలి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్‌సీపీ పరిశీలకులను నియమించినట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మంగళవారం తెలియజేశారు. టెక్కలి మండలానికి అన్నెపు రామారావు, కోటబొమ్మాళి మండలానికి కిల్లి అజయ్, సంతబొమ్మాళి మండలానికి చిన్ని జోగారావు, నందిగాం మండలానికి మార్పు నాగభూషణంలను నియమించినట్లు వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత



చిన్నారి తల్లికి నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ గ్రామంలో నివసిస్తున్న బండారు పావని కుమార్తె దియాకు కొన్నిరోజుల క్రితం న్యుమోనియా వ్యాధి సోకింది. పలు ఆస్పత్రిల్లో చూపించగా పాప వైద్యానికి లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురు చూశారు. ప్రస్తుతం చిన్నారి శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న విశాఖపట్నంకు చెందిన ఓఎస్‌జీ ఫౌండేషన్, విజయనగరానికి చెందిన జీఎస్ ఫౌండేషన్ సభ్యులు, కొఠారీ గ్రామానికి చెందిన యువత మంగళవారం చిన్నారి తల్లిదండ్రులకు రూ.1,00,600లు ఆర్థిక సాయాన్ని అందించి పెద్ద మనసు చాటుకున్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం



బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం సచివాలయంలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను పంచాయతీ కార్యవర్గం, గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. సచివాలయం పరిధిలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బైపల్లి ఈశ్వరరావు, బైపల్లి బాబురావు, బైపల్లి రామారావు, వాసుపల్లి రామారావు, సాగూరు జీవన్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

సోంపేట: యువతకు సీపీఆర్‌పై అవగాహన అవసరమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎస్.ఉమాశంకర్ అన్నారు. పట్టణంలోని సంస్కార భారతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్ చికిత్స విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వెంటనే సీపీఆర్ విధానం ద్వారా రోగిని బతికించే అవకాశాలు చాలా వరకు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

శివలింగానికి కిరణ స్పర్శ



మఠం సరియాపల్లిలోని రామలింగేశ్వర దేవాలయంలో శివలింగాన్ని మంగళవారం ఉదయం సూర్యకిరణాలు స్పృశించాయి. భానుడి లేలేత కిరణాలు దేవాలయం ముందు ఉన్న తులసీమాతను దర్శించుకొని, రాజగోపురం ద్వారా ధ్వజ స్తంభాన్ని తాకి లోపల ఉన్న నందీశ్వర విగ్రహాన్ని స్పృశించి దేవాలయం గర్భగుడిలోకి ప్రవేశించి శ్రీరామలింగేశ్వరుడ్ని కిరణాభిషేకం చేశాయి. ఈ అద్భుత ఘటనను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– కంచిలి

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ మెరుగవ్వాలి

ఇచ్ఛాపురం: స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ర్యాంకింగ్ మెరుగవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో సమావేశం మంగళవారం నిర్వహించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సచివాలయ రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరకానికి నకళ్లు..?



రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రావివలస - వడ్డితాండ్ర రోడ్డు



నరకాన్ని తలపిస్తున్న టెక్కలి - చెట్లతాండ్ర రోడ్డు

- అధ్వానంగా రహదారులు
- ప్రయాణాలకు అవస్థలు

టెక్కలి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గోతులతో నరకానికి నకళ్లుగా మారాయి. వర్షాకాలం కావడంతో గోతుల్లోకి నీరుచేరి ప్రమాదాలబారిన వాహనదారులు పడుతున్నారు. టెక్కలి నుంచి రావివలస మీదుగా వెళ్లే వడ్డితాండ్ర రోడ్డు, టెక్కలి అంబేద్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర రోడ్డులో భారీగా ఏర్పడిన గోతులతో ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి నుంచి రావివలస మీదుగా బృందావనం, దండుగోపాలపురం, వడ్డితాండ్ర వెళ్లే రోడ్డులో రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై పలుమార్లు అధికార యంత్రాంగానికి మొర పెట్టుకున్నప్పటికీ స్పందించకపోవడంతో, ఆయా గ్రామాల ప్రజలంతా సాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా మరోసారి ఆర్డీవోకు సైతం వినతిపత్రం అందజేశారు. అధ్వానంగా ఉన్నటువంటి రోడ్డుకు మోక్షం కల్పించాలని వేడుకున్నారు. టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర రోడ్డుదీ అదే పరిస్థితి. కొంతమేరకు మరమ్మతులు చేపట్టినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా వదిలేశారు. అందువలన ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సాధన కమిటీ ఏర్పాటు చేసుకున్నాం



టెక్కలి నుంచి రావివలస మీదుగా వడ్డితాండ్ర వరకు ఉన్నటువంటి రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. రోడ్డు మరమ్మతులు చేయాలని దిగువ స్థాయి అధికారులను కోరినప్పటికీ వారు స్పందించకపోవడంతో.. ఆయా గ్రామాల ప్రజలతో కలిసి రోడ్డు సాధన కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. ఈ సాధన కమిటీతో దశల వారీగా ఉద్యమాన్ని చేపడతాం.

– కోత మధుసూదనరావు, ఆర్వీ రోడ్డు సాధన కమిటీ కన్వీనర్

చినుకు పడితే చిత్తడే

- బురదమయంగా మఠం సరియాపల్లి నుంచి వెళ్లే రోడ్డు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



బురదమయంగా మారిన మోడల్ స్కూల్ రోడ్డు మార్గం

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామం నుంచి ఏపీ మోడల్ స్కూల్ సహా వివిధ గ్రామాలకు వెళ్లే రహదారి మార్గం చిన్నపాటి వర్షానికి కూడా చిత్తడిగా మారుతోంది. చాలా కాలంగా ఈ రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని మఠం సరియాపల్లితోపాటు, ఆ మార్గంలో ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో మఠం సరియాపల్లి గ్రామ పరిధిలో ఉన్న పీహెచ్‌సీతోపాటు ప్రాథమిక పాఠశాల, బీసీ హాస్టల్, ఏపీ ఆదర్శ పాఠశాల, శివాలయం, జగనన్న కాలనీ, విద్యుత్ సబ్‌స్టేషన్, వైఎస్సార్ పార్కు, పుడాభద్ర, రాగుపురం, దాలేశ్వరం, భోగాబెణి గ్రామాలున్నాయి. ఈ మార్గంలో భోగాబెణి గ్రామం తర్వాత ఆ పంచాయతీలో గ్రామాలతోపాటు కంచిలి నుంచి భోగాబెణి, మరోవైపు గోపకేళి గ్రామాలకు వేసే తారురోడ్డు మార్గం కలుస్తుంది. దీంతో ఈ మార్గం మీదుగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రహదారి మార్గాన్ని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ పెద్దలు పలుమార్లు చెప్పినప్పటికీ, ఆచరణలో ఇంకా అడుగు ముందుకు పడలేదని స్థానికులు వాపోతున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా రోడ్డు పరిస్థితి

రోడ్డు సమస్యతో సతమతం



మఠం సరియాపల్లి గ్రామం నుంచి భోగాబెణి గ్రామం వరకు ఉన్న రోడ్డు దారుణంగా తయారైంది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణమంటే హడలెత్తిపోవాల్సిందే. ఈ మార్గంలోనే ముఖ్యమైన ప్రభుత్వ సంస్థలు, వివిధ గ్రామాలు ఆధారపడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ మార్గాన్ని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలి.

– కొణవల సురేష్, సర్పంచ్, మఠం సరియాపల్లి

కుటీర పరిశ్రమల్లా కల్తీ మద్యం కేంద్రాలు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం కేంద్రాలు కుటీర పరిశ్రమల్లా వెలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. మంగళవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కల్తీ మద్యంపై ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పూర్తిగా మొద్దునిద్రలో ఉన్నారని విమర్శించారు. కల్తీ మద్యం మరణాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్‌పై చేసిన ఆరోపణలపై ఆయన చేసిన సవాల్‌కు కూటమి నాయకులు ఎందుకు స్పందించడం లేదన్నారు. కల్తీ మద్యంతో వచ్చిన ఆదాయాన్ని చంద్రబాబు తన కరకట్ట నివాసంలో దాచి పెడుతున్నారని ఆరోపించారు. దమ్ముంటే కల్తీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరి ప్రసాద్ అండతో మద్యం సిండికేట్ కొనసాగుతోందన్నారు. ప్రతీ గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఉన్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోవడం లేదని దుమ్మెత్తి పోశారు. టీడీపీ నేతలు సొంత ఆదాయం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు.